సాక్షి
కుమురం భీం
శుక్రవారం : 23 : ఫిబ్రవరి : 2024



## గాంధారి మైసమ్మ జాతర



బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరకు సన్నద్ధమవుతోంది. నేటి నుంచి మూడు రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు.

8లో ▸



## దారి మళ్లుతున్న రేషన్

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. దళారులు అక్రమంగా పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.2 /19.6

## వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

## న్యూస్‌రీల్

### సమ్మె విజయవంతం చేయాలి



సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు

**ఆసిఫాబాద్‌రూరల్:** గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలోని రోజువారి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 10న నిర్వహించే సమ్మె విజయవంతం చేయాలని గిరిజన ఆశ్రమ హాస్టల్స్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో డీటీడీవో రమాదేవికి గురువారం సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు 9 నెలల నుంచి జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. మార్చి 10న వంటలు బంద్ చేసి సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, నాయకులు బాలకిషన్, సునీత, నాందేవ్, శేఖర్, జ్యోతి, స్వర్ణలత, జ్యోతి పాల్గొన్నారు.

### జాతరకు పటిష్ట బందోబస్తు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

**రెబ్బెన(ఆసిఫాబాద్):** రెబ్బెన మండలం గంగాపూర్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులపాటు కొనసాగే జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆలయాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఒక డీఎస్పీ, ఏడుగురు సీఐలు, 13 మంది ఎస్సైలు, వంద మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నార. భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం ఆలయ ఈవో బాపిరెడ్డి ఎస్పీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణాప్రతాప్, సీఐలు చిట్టిబాబు, సతీశ్, శ్రీనివాస్, ఎస్సైలు చంద్రశేఖర్, రమేశ్ పాల్గొన్నారు.

### గ్రామాల్లో నీటి ఎద్దడి రానివ్వొద్దు



జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**కెరమెరి(ఆసిఫాబాద్):** వేసవి దృష్ట్యా మారుమూల గ్రామాల్లో నీటి ఎద్దడి రానివ్వొద్దని జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్ అన్నారు. డిప్యూటీ సీఈవో సత్యనారాయణతో కలిసి గురువారం మండల కేంద్రంలో పర్యటించారు. సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెరగాలని, ప్రతిరోజూ ఒక్కో పంచాయతీలో కనీసం వందమంది పనులకు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జెడ్పీటీసీ దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీడీవో కృష్ణారావు జెడ్పీ సీఈవోను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ కార్యాలయ సూపరింటెండెంట్ తోటాజీ, సిబ్బంది సుధాకర్, ప్రసాద్, రాజేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### 'తమ్మినేని'ని కలిసిన జిల్లా నాయకులు



తమ్మినేని వీరభద్రంతో జిల్లా నాయకులు

**ఆసిఫాబాద్:** సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను గురువారం జిల్లా నాయకులు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకుని పరామర్శించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలు, మెడికల్ కళాశాల సమస్యలను తమ్మినేని దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్, దినకర్ ఉన్నారు.

# బీజేపీ నిర్ణయాలతో మిల్లు పునరుద్ధరణ



పురుషోత్తంరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే హరీశ్‌బాబు, తదితరులు

- ఎస్పీఎం కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం
- కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- స్థానికుల కంటే స్థానికేతరులకు అధిక జీతాలు ఇస్తున్నారు: ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

**కాగజ్‌నగర్‌రూరల్:** భారతీయ జనతా పార్టీ తీసుకున్న నిర్ణయాలతోనే కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు(ఎస్పీఎం) మిల్లు పునరుద్ధరణ సాధ్యమైందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రజా కార్యాలయంలో గురువారం మిల్లు కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌సీఎల్‌టీ విధానాలను తెచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. కార్మికుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తాము క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. కానీ ప్రస్తుత మిల్లు యాజమాన్యం కార్మికులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. సిర్పూర్ పేపరు మిల్లు కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే యాజమాన్యాన్ని ఢిల్లీ పిలిపించుకుని మాట్లాడతామని తెలిపారు. అనంతరం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ మిల్లు యాజమాన్యం స్థానికేతరులకు అధిక జీతాలిచ్చి, స్థానికులకు తక్కువ ఇవ్వడంపై మండిపడ్డారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తాను అసెంబ్లీలో కూడా ప్రస్తావించినట్లు తెలిపారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ఎస్పీఎం యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. కార్మికుల హక్కుల కోసం కొట్లాడి వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు సాయంత్రం 5 గంటలకు హెలికాప్టర్‌లో పట్టణానికి చేరుకున్న కేంద్ర మంత్రికి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. దివంగత సిర్పూర్ ఎమ్మెల్యే పురుషోత్తంరావు చిత్రపటానికి ఎమ్మెల్యే హరీశ్‌బాబుతో కలిసి నివాళులర్పించారు. సమావేశంలో ప్రభారి రాజమౌళి, కల్లోల భట్టాచార్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు వెంకటేశం, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, నాయకులు విశ్వేశ్వర్‌రావు, శ్రీనివాస్, బాల్కశ్యాం తదితరులు పాల్గొన్నారు.

**బెంగాలీలను బీజేపీ ఎప్పుడూ మర్చిపోదు..**

బెంగాలీ ప్రజలను బీజేపీ ఎప్పుడూ మర్చిపోదని కేంద్ర మంత్రి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లోని వేదమందిర్ వద్ద బెంగాలీ ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సోయం బాపూరావు, అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా హరీష్‌బాబుకు బెంగాలీలు ఓట్లు వేసి గెలిపించారని గుర్తు చేశారు. బెంగాలీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఎస్టీ కుల ధృవీకరణ పత్రం ఇచ్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తన గెలుపులో బెంగాలీల పాత్ర ఎంతో ఉందని ఎమ్మెల్యే హరీశ్‌బాబు స్పష్టం చేశారు. స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం మినీ స్టేడియం, క్రీడామైదానం, సకల వసతులు కలిగిన ఆస్పత్రి, లోయర్‌డ్యాం, అప్పర్ డ్యాం మరమ్మతు చేపట్టాలని ఎంపీటీసీ సభ్యుడు బికాస్ ఘరామి కేంద్రమంత్రికి విన్నవించారు. సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాయకులు అనూప ఘరామి, సిమిరన్ గుప్తా, రణవీర్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. గురువారం రాత్రి పట్టణంలోని ఎస్పీఎం గెస్ట్ హౌజ్‌లో కేంద్ర మంత్రి బస చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

**నేడు కాగజ్‌నగర్‌లో విజయ సంకల్పయాత్ర**

**కాగజ్‌నగర్‌రూరల్:** బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణానికి చేరుకోనుందని ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌక్ వద్ద రోడ్‌షో ఉంటుందన్నారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రోడ్‌షోలో పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# రుణమాఫీ చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

- పార్లమెంట్ ఎన్నికల కోసమే కాంగ్రెస్ కొత్త నాటకాలు
- జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై పాలకుల నిర్లక్ష్యం
- మోదీని సంపూర్ణ మెజార్టీతో గెలిపించాలి
- విజయ సంకల్పయాత్రలో బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

**ఆసిఫాబాద్/కెరమెరి:** 'నేనే గొప్ప ముఖ్యమంత్రి అని గొప్పలు చెప్పుకున్న కేసీఆర్ రూ.10 లక్షల దళితబంధు పథకం అమలు చేయలేకపోయారు.. ఇప్పుడు అమలు కాని హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒకే విడతలో రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా..' అని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్, రాష్ట్ర మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కుమురంభీం క్లస్టర్ పేరుతో బీజేపీ చేపట్టిన విజయ సంకల్పయాత్ర జైనూర్, కెరమెరి మండలాల మీదుగా గురువారం రాత్రి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈటల రాజేందర్ పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ హామీలు అమలు చేయాలంటే రూ.5 లక్షల కోట్ల బడ్జెట్ అవసరమన్నారు. మొన్నటి వరకు కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కొత్త నాటకానికి తెర తీశారని విమర్శించారు. 'రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ ప్రజలకు ఇవ్వాలని కోరుకుంటున్నా.. కానీ ఇప్పుడు వారే అసెంబ్లీలో ఇచ్చే సత్తా తమకు లేదని చెబుతున్నారు..' అని ఆ పార్టీ నేతలను ఎద్దేవా చేశారు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై పాలకుల నిర్లక్ష్యంతో రైతులకు సాగునీరందని దుస్థితి నెలకొందన్నారు. రైతులు దశాబ్దాలుగా వర్షాధార పంటలపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్ వరకు ఎక్కడ చూసినా కాంగ్రెస్ హామీల అమలు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ సాధ్యమా అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనను ప్రజలు ఇంటికి పంపారని గుర్తు చేశారు. 500 ఏళ్ల హిందువుల ఆకాంక్ష అయోధ్య శ్రీరామ మందిర నిర్మాణాన్ని ధర్మబద్ధంగా ప్రధాని నరేంద్ర మోదీ నెరవేర్చారని తెలిపారు. బీజేపీని సంపూర్ణ మెజార్టీతో అధికారంలోకి తేవాలని కోరారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలో ఉక్రెయిన్‌లోని భారత విద్యార్థులను సురక్షితంగా దేశానికి కృషి చేసిన ఘనత ప్రధాని నరేంద్రమోదీ అని గుర్తు చేశారు. ఎంపీ సోయం బాపూరావు మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో ఉచిత వ్యాక్సిన్‌తోపాటు పేదలకు ఉచిత ఉచిత బియ్యాన్ని మరో ఐదేళ్లు పొడిగించిన ఘనత నరేంద్ర మోదీదేనని గుర్తు చేశారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ మాట్లాడుతూ.. ఎన్నికల హామీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందని మండిపడ్డారు. ఈ సందర్భంగా బీజేపీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై కళాకారులు ప్రదర్శనలిచ్చారు. అంతకు ముందు ర్యాలీగా అంబేడ్కర్ చౌక్‌కు తరలి వచ్చారు.

**పేదల భూములు తిరిగి ఇవ్వాలి**

అంతకు ముందు జైనూర్ మండల కేంద్రంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం గిరిజనులు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు, రైతుబంధు ఇవ్వకుండా తిప్పలు పెట్టిందన్నారు. పేదల నుంచి లాక్కున్న భూములను వారికి తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనేతరులు సాగు చేసుకుంటున్న భూముల సమస్యలు పరిష్కరించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల ఇళ్లు ఇస్తే వాటిని తెచ్చుకోవడంలో కేసీఆర్ నిర్లక్ష్యం వహించారన్నారు. కెరమెరి మండల కేంద్రంలోని నెహ్రూ నగర్‌లోని కుమురంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమన్న, నాయకులు గంగారెడ్డి, ఆంజనేయులుగౌడ్, కిరణ్, ఆత్మారాంనాయక్, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- గిరిజన ఆశ్రమ పాఠశాలలు తనిఖీ



పాఠాలు బోధిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

**వాంకిడి(ఆసిఫాబాద్):** పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలతోపాటు బంబార గిరిజన ఆశ్రమ పాఠశాలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించి వారి ప్రతిభను పరీక్షించారు. పదో తరగతి విద్యార్థులపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు రాబట్టాలన్నారు. ఆశ్రమాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, పిల్లలు వ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆస్పత్రిని సందర్శించారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు.

# వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

**ఆసిఫాబాద్‌రూరల్:** పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఐఈవో శంకర్, డీఈవో అశోక్‌తో కలిసి పరీక్షల నిర్వహణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షలకు 19 కేంద్రాలు, మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు 37 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఎస్పీ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం

- ఎస్పీ సురేశ్‌కుమార్



కిట్లు అందజేస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

**ఆసిఫాబాద్‌అర్బన్:** క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్‌లో జిల్లా స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బందికి గురువారం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూనే, క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోలీసు స్పోర్ట్స్ మీట్‌లో జిల్లాకు పతకాలు సాధించేందుకు, క్రీడాకారులు ప్రతిభ చూపేందుకు కిట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, ఆర్ఐ పెద్దన్న, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకన్న జాతరకు వేళాయె

- గంగాపూర్‌లో మూడు రోజులపాటు జాతర మహోత్సవం
- నేడు కల్యాణోత్సవం.. రేపు స్వామి వారి రథోత్సవం
- భారీగా తరలిరానున్న భక్తజనం



విద్యుత్ వెలుగుల్లో వేంకటేశ్వరస్వామి ఆలయం

**రెబ్బెన(ఆసిఫాబాద్):** జిల్లాలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జాతర నిర్వహించనున్నారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు అంగరంగ వైభవంగా ఈ మహోత్సవం సాగనుంది. రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామ శివారులోని వాగు ఒడ్డున కొలువైన శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మొదటి రోజు స్వామి వారి కల్యాణం, రెండోరోజు రథోత్సవం, మూడోరోజు భక్తులకు దర్శనం తర్వాత జాతర ముగియనుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భక్తులతో పాటు కరీంనగర్, వరంగల్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు.

**బాలాజీ వెంకన్న కొలువైన తీరు**

గంగాపూర్ శివారులోని గుట్టపై ఉన్న శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి కొలువైన తీరు, ఆలయ నిర్మాణానికి సంబంధించిన చారిత్రాత్మక ఆధారాలు ఇలా ఉన్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 16వ శతాబ్దానికి ముందు ఇదే గ్రామానికి చెందిన ముమ్మడి పోతాజీ అనే భక్తుడు చిన్నతనం నుంచి భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలుస్తూ ఏటా మాఘశుద్ధ పౌర్ణమి రోజున తిరుమల తిరుపతి వరకు కాలినడకన వెళ్లి మొక్కులు చెల్లించుకునేవాడు. కాలక్రమేనా వయస్సు పైబడంతోపాటు ఆరోగ్యం సహకరించక తిరుపతి వరకు వెళ్లలేకపోవడంతో మనోవేదనకు గురవుతాడు. స్వామి వారే పోతాజీ కలలో కనిపించి గ్రామ పొలిమేరలోని గుట్టలో కొలువై ఉన్నానని, ఆలయం నిర్మించాలని కోరినట్లు స్థానికులు చెప్పుకుంటారు. ఏటా మాఘశుద్ధ పౌర్ణమి పర్వదినాన నీకోసం, నీలాంటి భక్తుల కోసం దర్శనం ఇస్తానని చెప్పినట్లు ప్రచారంలో ఉంది. దీంతో గంగాపూర్ వాగులో పుణ్యస్నానమాచరించి గుట్టను తొలగవగా స్వామి పట్టెనామాలు దర్శనమిచ్చినట్లు చెబుతుంటారు. నాటి నుంచి నేటి వరకు ప్రతీ మాఘశుద్ధ పౌర్ణమి పర్వదినాన స్వామివారు ఆలయంలో కొన్ని గడియలు కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తుంటాడని నమ్మకం ఏర్పడింది.



ఆలయంలో వేంకటేశ్వర స్వామి, అలివేలు మంగ, పద్మావతి విగ్రహాలు


**భక్తులకు వసతులు**

గంగాపూర్ జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే స్వామి వారి ఆలయంతోపాటు పోతాజీ సమాధి, ముఖద్వారాన్ని రంగులు వేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. భక్తుల కోసం తాగునీటి సౌకర్యం కల్పించగా, మండల కేంద్రంలోని వ్యాపారులు అన్నదానం ఏర్పాట్లు చేయనున్నారు. ఆసిఫాబాద్, బెల్లంపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడపనుంది. రెండో రోజు నిర్వహించే రథోత్సవానికి సుమారు 2 లక్షల మంది భక్తులు తరలివస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. దుకాణాలు, రంగుల రాట్నం, జంపింగ్ పార్క్ తదితర ఏర్పాట్లతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ, ఏడుగురు సీఐలు, 13 మంది ఎస్సైలు, 100 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.



జాతరలో ఏర్పాటు చేసిన రంగులరాట్నం

### ఏర్పాట్లు పూర్తి



గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జాతరకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. జిల్లాలో జరిగే అతిపెద్ద జాతర ఇది. మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా జాతర నిర్వహించడం ఆనవాయితీ వస్తోంది. శనివారం నుంచి సోమవారం వరకు జరిగే జాతర కోసం ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఇబ్బందుల తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– బాపిరెడ్డి, ఆలయ ఈవో

### అంగరంగ వైభవంగా..



ప్రతీ సంవత్సరం గంగాపూర్ బాలాజీ ఆలయంలో జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతుంది. మొదటిరోజు స్వామి, అమ్మవార్ల కల్యాణంతో జాతర ప్రక్రియ ప్రారంభమవుతుంది. రెండోరోజు ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం నిర్వహిస్తాం. ఈ సారి సుమారు 2 లక్షలకు మందికి పైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.

– కొమ్మెర గణేశ్‌శర్మ, ఆలయ అర్చకులు

## క్లుప్తంగా

### కలప తరలిస్తున్న కారు పట్టివేత



అధికారులు పట్టుకున్న కారు

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని కవ్వాల్ సెక్షన్ నుంచి కామన్‌పల్లి వైపు అక్రమంగా కలప తరలిస్తున్న కారును పట్టుకున్నట్లు ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు. గురువారం కవ్వాల్ నుంచి జన్నారం వైపు అతివేగంగా వెళ్తున్న కారును అనుమానం వచ్చిన కవ్వాల్ సెక్షన్ సిబ్బంది వెంబడించి తనిఖీ చేయగా అందులో 6 టేకు దుంగలు లభించాయి. కారు, కలపను డివిజన్ కార్యాలయానికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న దేవునిగూడకు చెందిన రాగి పవన్‌కుమార్, దస్తూరాబాద్ మండలం రేవోజిపేటకు చెందిన ఓరుగంటి నర్సింహచారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ.37వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

### ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణం



సమ్మయ్య (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన విజ్జగిరి సమ్మయ్య(51) హాజీపూర్ మండలం వేంపల్లి శివారులోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంచిర్యాల తోళ్లవాగు సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటుండగా ఇటీవల ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 20న రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, కుమారుడు రోహిత్, కుమార్తె సునందిని ఉన్నారు. రోహిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



# మోదీ హయాంలోనే దేశాభివృద్ధి

- యూపీఏ పాలనలో అనేక కుంభకోణాలు
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం కార్మికులు, బెంగాలీలతో సమావేశం



మాట్లాడుతున్న కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


కాగజ్‌నగర్‌రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజా కార్యాలయంలో గురువారం సిర్పూర్ పేపర్ మిల్లు(ఎస్పీఎం) కార్మికులతో సమావేశం అయ్యారు. కాగజ్‌నగర్ మండలంలోని వేదమందిర్ వద్ద బెంగాలీ ప్రజలతో సమావేశమై మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వ పాలనలో 2జీ స్పెక్ట్రమ్, బొగ్గు, కామన్‌వెల్త్ గేమ్స్ నిర్వహణ, తదితర కుంభకోణాల్లో రూ.12లక్షల కోట్లు పక్కదారి పట్టాయని ఆరోపించారు. అందుకే కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగుచెంది 2014 ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టారని స్పష్టం చేశారు. ఈ పదేళ్లలోనే దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని అన్నారు. మచ్చలేని నాయకుడిగా మోదీ పేరు తెచ్చుకున్నారని, శత్రువు కూడా మెచ్చుకున్న నాయకుడిగా నిలిచారని కొనియాడారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత కశ్మీర్ ప్రజలు స్వేచ్ఛ వాయువులు పీల్చుకుంటున్నారని పేర్కొన్నారు. అక్కడ ఉగ్రవాదం, తీవ్రవాదం, ఐఎస్ఐ దాడులు ఇప్పుడు లేవని తెలిపారు. ఇప్పటికీ కొన్ని పార్టీలు ఓటుబ్యాంకు, కుటుంబ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. ఒక్క బీజేపీ మాత్రమే ప్రజాపాలన చేస్తోందన్నారు. దేశంలో జాతీయ రహదారులు, ఉత్పత్తి రంగాల్లో గణనీయమైన మార్పులు రావడంతో ఉపాధి పెరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా కరోనా వ్యాక్సిన్లు తయారు చేసి దేశ ప్రజలకు ఉచితంగా అందించామని, అలాగే 150 దేశాలకు సరఫరా చేశామన్నారు. సమర్థవంతమైన నాయకత్వంతోనే ఇదంతా సాధ్యమైందన్నారు. అంతకు ముందు ప్రజాకార్యాలయంలో దివంగత ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తమరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, ప్రభారి రాజమౌళి, కల్లోల భట్టాచార్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు వెంకటేశం, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధారి మైసమ్మ జాతర




కొలువుదీరిన మైసమ్మ తల్లి

- నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు
- తరలిరానున్న అశేష భక్తజనం



గాంధారి ఖిల్లా ప్రవేశ ద్వారం



కాలభైరవుడి విగ్రహం



జాతర జరుగనున్న ప్రాంతం

రామకృష్ణాపూర్(చెన్నూర్): మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులో ఉన్న గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరకు సన్నద్ధమవుతోంది. గిరిజనుల ఆరాధ్యదైవం గాంధారి మైసమ్మ ఖిల్లాలో కొలువై ఉండడంతో ఏటా మూడు రోజుల పాటు ఇక్కడ జాతర నిర్వహిస్తారు. చారిత్రాత్మక ప్రాంతం.. ఎంతగానో ప్రాశస్త్యమున్న ఖిల్లాలో అధికారికంగా జాతర నిర్వహించాలని ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా కొన్నేళ్ల నుంచే జాతర నిర్వహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా బొక్కలగుట్ట శివారు నుంచి జాతర జరిగే ఖిల్లా ప్రాంతానికి వెళ్లేందుకు ఇప్పటికే రోడ్డు నిర్మించారు. భక్తుల సౌకర్యార్థం విద్యుత్, నీటి సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్లు, తదితర ఏర్పాట్లు చేశారు. ఆరెకరాల విస్తీర్ణంలో ఉన్న జీడికోటలో మూడు రోజుల పాటు జరుగనున్న ఈ గాంధారి మైసమ్మ జాతరకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

### జాతర నిర్వహణ ఇలా...

మొదటి రోజు శుక్రవారం దేవతా మూర్తులను మంచిర్యాలలోని గోదావరినదికి స్నానానికి తీసుకెళ్తారు. డప్పు చప్పుళ్లు, గిరిజనుల సంప్రదాయ నృత్యాల నడుమ గోదావరికి తీసుకెళ్లి సాయంత్రం సదర్‌భీమన్న వద్దకు తీసుకువస్తారు. ఇక్కడ రాత్రి ఆట పాటలతో గడిపి మరుసటి రోజు మధ్యాహ్నం జాత ర జరిగే ఖిల్లా ప్రాంతానికి తరలిస్తారు. రాత్రి మరోసారి ఆటపాటలు నిర్వహించి ఆదివారం తెల్లవారుజామున గాంధారి ఖిల్లా పైభాగంలో ఉన్న మైసమ్మ తల్లి వద్ద పట్నాలు వేసి, నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం జీడికోటలో నిర్వహించే దర్బార్(సభ)వద్దకు తిరిగివస్తారు. దర్బార్‌లో గిరిజనుల సాంస్కృతిక తీరుతెన్నులు, వనదేవతలను పూజించడంలో విశిష్టత, గాంధారి ఖిల్లా అభివృద్ధిపై చర్చిస్తారు. మూడు రోజుల పాటు జరుగనున్న జాతరలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన, నాయక్‌పోడ్ సంఘాల నాయకులు పాల్గొననున్నారు.

### ఒడ్డెరాజుల కాలంలో వెలుగొందిన ఖిల్లా...

సుమారు 600 సంవత్సరాలకు పూర్వం కాకతీయుల సామంతులుగా పిలువబడే ఒడ్డెరాజుల కాలంలో గాంధారి ఖిల్లా వెలుగొందినట్లు చారిత్రక ఆనవాళ్లు చెబుతున్నాయి. ఒడ్డె రాజుల అనంతరం గోండు రాజులు ఈ ఖిల్లాను కేంద్రంగా చేసుకుని పాలించారని చెబుతుంటారు. ఒడ్డె రాజుల కాలంలో నిర్మించిన ఈ ఖిల్లా అప్పటి వారి కళా నైపుణ్యానికి అద్దంపడుతోంది. ఖిల్లాలో నాగశేషుడి విగ్రహం, శివుడు, విఘ్నేశ్వరుడు, ఆంజనేయుడు, కాలభైరవుని విగ్రహాలతో పాటు దేవతామూర్తుల విగ్రహాలు ఉంటాయి. ఖిల్లాపై భాగంలో శత్రువుల రాకను పసిగట్టేందుకు నగారా గుండు నిర్మించారు. కొండను తొలిచి నిర్మించిన నాగశేషుడి ఆలయం ఆకట్టుకుంటుంది. దిగువ భాగంలో సహజసిద్ధంగా ఉండే ఊటచెలిమెకు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడ నీళ్లు ఎప్పటికీ ఇంకిపోకుండా పైకి తేలుతుంటాయి. గుట్టపై నిర్మించిన కోటలో అనేక కళారూపాలు, శిలాసంపద, విగ్రహాలు ఉండటంతో జాతరకు హాజరయ్యే భక్తులతో పాటు ఖిల్లాను తిలకించేందుకు వచ్చే వారి సంఖ్య కూడా అధికంగానే ఉంటుంది.

## 25న సీఓఈ సెకండ్ స్క్రీనింగ్ టెస్ట్

- ఆదిలాబాద్ రీజియన్‌లో నాలుగు పరీక్ష కేంద్రాలు
- గురుకుల వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు

బెల్లంపల్లి: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్(సీఓఈ) కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల 25న సెకండ్ స్క్రీనింగ్ టెస్ట్ జరగనుంది. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 4న నిర్వహించిన మొదటి విడత ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను రెండో విడత పరీక్ష రాయడానికి అవకాశం కల్పించారు. సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, బెల్లంపల్లి సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ సైదులు తెలిపారు. బాలబాలికల కోసం రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, లక్సెట్టిపేట, చెన్నూర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులకు డిస్క్రిప్టివ్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తారు. అనుమానాల నివృత్తి, ఇతర వివరాల కోసం 9948714105 నంబరులో సంప్రదించాలని సూచించారు.

### మాజీ సర్పంచ్‌పై కేసు నమోదు

కాసిపేట: సోమగూడెం(బి) గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కొరకొప్పుల ప్రమీలగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. పాతబెల్లంపల్లి ఎంపీటీసీ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ నాయకుడు ముత్తె భూమయ్య సర్వే నంబర్ 2పైకి, 3పైకిలలో భూములు కబ్జా చేశారని ప్రమీలగౌడ్ సోషల్ మీడియాలో ఆరోపించారు. ఆ వీడియోల ద్వారా తగాదాలు ఏర్పాడే అవకాశం ఉందని, అతనిపై చర్యలు తీసుకోవాలని ముత్తె భూమయ్య బుధవారం రాత్రి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పోచమ్మా... నీ పార్కు తీరు కనవమ్మా...!



పచ్చగడ్డి ఎండిపోయి దర్శనమిస్తున్న వాకింగ్ ట్రాక్



మొండెం తెగిపోయి ఉన్న కొంగ బొమ్మ



తొండం, తోక విరిగి పోయి ఉన్న ఏనుగు బొమ్మ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పోచమ్మ చెరువు పార్కును పట్టణ ప్రగతి నిధులు రూ.48 లక్షలతో నిర్మించి 2022 నవంబర్ 5న ప్రారంభించారు. రెండేళ్ల లోపే అధ్వానంగా మారడంతో చిన్నారులకు ఆటవిడుపు లేకుండా పోతోంది. పార్కు ఆవరణలో పచ్చిక బయళ్లు కానరావడం లేదు. వాకింగ్ ట్రాక్‌లో, అంతర్భాగంలో పెంచిన గడ్డి ఎండిపోయి పార్కు కళావిహీనంగా మారింది. నీళ్లు పట్టకపోవడంతో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. చిన్నారులను ఆకర్షించేందుకు ఏర్పాటు చేసిన ఏనుగు, కొంగబొమ్మలు విరిగి పోయాయి. నెమలి, జింక, పులి, తదితర బొమ్మల రంగులు వెలిసిపోయాయి. రాత్రిపూట ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధుల పర్యవేక్షణ కొరవడటంతో పార్కు ఎందుకూ కొరగాకుండా పోతోందని పుర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గద్దెపై కొలువుదీరిన సమ్మక్క



సమ్మక్కకు మొక్కుతున్న జెడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, జీఎం మనోహర్

- జాతరకు పోటెత్తిన భక్తజనం

రామకృష్ణాపూర్(చెన్నూర్): సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆర్కే1ఏ గని శివారులో పాలవాగు వద్ద ఏర్పాటు చేసిన జాతరలో గురువారం సమ్మక్కను గద్దెకు తీసుకొని వచ్చారు. శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల మధ్య సమ్మక్కను మందమర్రికి చెందిన దూలం కనకయ్య ఇంటి నుండి ఊరేగింపుగా జాతర ప్రాంగణానికి తీసుకువచ్చారు. మేడారంకు చెందిన గిరిజన పూజారుల వేదమంత్రోచ్ఛణాలతో సమ్మక్కను గద్దెకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. కార్మిక కుటుంబాలతో పాటు పరిసర గ్రామాల నుంచి అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, డైరెక్టర్ మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్ట్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కె.కర్త, మందమర్రి జీఎం మనోహర్, జీఎం ఎన్విరాన్‌మెంట్ గణపతి, ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తనయుడు గడ్డం వంశీ, ఆయా యూనియన్లు, రాజకీయ పార్టీల నాయకులు దర్శించుకున్నారు.



సమ్మక్కను ఊరేగింపుగా తీసుకువస్తున్న దృశ్యం

# జ్వరంతో మైనార్టీ పాఠశాల విద్యార్థిని మృతి

- సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ



షేక్ అంజుమ్(ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన షేక్ కరీం, ఫాతీమ దంపతుల కుమార్తె షేక్ అంజుమ్(13)గురువారం జ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్‌లోని మైనార్టీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న షేక్ అంజుమ్ ఈ నెల 20న అనారోగ్యానికి గురికావడంతో పాఠశాల సిబ్బంది ఫోన్ ద్వారా బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులు పాఠశాలకు వెళ్లి బాలికను ఇంటికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయాన్నే ఆసిఫాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి రక్త పరీక్షలు చేయించగా ప్లేట్‌లెట్స్ తగ్గిపోయినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించి చికిత్స ప్రారంభించారు. గురువారం తెల్లవారు జామున మళ్లీ అస్వస్థతకు గురికావడంతో మహారాష్ట్రలోని చంద్రపూర్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.


**ముందుగా తెలిసుంటే కాపాడుకునే వాళ్లం..**

తమబిడ్డ ఆరోగ్యం పూర్తిగా క్షీణించాకే సమాచారం అందించారని బాలిక కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ముందుగానే తెలిసుంటే కాపాడుకునే వారిమని, పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమబిడ్డ ప్రాణాలు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే పాఠశాలలో చదువుకుంటున్న ఓ విద్యార్థిని భోజనం నాణ్యతతో కూడుకున్నది కాకుండా ఇష్టరీతిన వడ్డిస్తున్నారని పేర్కొంది. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వే బ్రిడ్జి కింద నీటి మడుగులో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ రవీందర్ తెలిపారు. జాలర్ల సాయంతో బయటకు తీసి పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. నీటి మడుగు పక్కనే ఒడ్డుకు ఓ షర్ట్ లభించిందని, ఆ షర్ట్‌ను పరిశీలించగా ఈ నెల 19 న చెన్నూర్ నుంచి మంచిర్యాలకు ఆర్టీసీ బస్సులో వచ్చినట్లు బస్సు టిక్కెట్ లభించిందన్నారు. మృతుడు ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి మృతి చెందినట్లు భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. వివరాలకు 8712656534 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



నగేశ్ (ఫైల్)

జన్నారం: కారును ఓవర్ టేక్ చేయబోయి బైక్ అదుపుతప్పి కిందపడడంతో ఒకరు మృతి చెందిన సంఘటన జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం అలీనగర్ గ్రామానికి చెందిన సిడాం నగేశ్ (45), కుర్సింగ భీంరావు గురువారం ద్విచక్ర వాహనంపై దండేపల్లి మండలం తాళ్లపేటలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మహ్మదాబాద్ గ్రామ సమీపంలో కారును ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి కిందపడ్డారు. నగేశ్ అక్కడికక్కడే మృతి చెందగా భీంరావు గాయాలైనట్లు మృతుని సోదరుడు కృష్ణ తెలిపారు. భీంరావును లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య శారద, కూతురు పూజ ఉన్నారు.

# పూలే దంపతుల విగ్రహాలు ధ్వంసం

- నిందితుడిపై కేసు నమోదు
- రిమాండ్‌కు తరలింపు



బోరంపల్లిలో ధ్వంసమైన పూలే విగ్రహం

కోటపల్లి(చెన్నూర్): మండలంలోని బోరంపల్లిలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే దంపతుల విగ్రహాలను బుధవారం రాత్రి గ్రామానికి చెందిన ఉడుత బాపు గొడ్డలితో ధ్వంసం చేశాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామ కార్యదర్శి మధుకర్ ఫిర్యాదు మేరకు నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సుధాకర్ తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సీఐ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలోని హనుమాన్ విగ్రహం ధ్వంసం చేయడంతోనే పూలే విగ్రహాలను ధ్వంసం చేసి ఉంటారని గ్రామంలో పెద్ద ఎత్తున చర్చించుకోవడం కొసమెరుపు. గ్రామానికి సమీపంలోని అటవీప్రాంతంలో వెలిసిన హనుమాన్ విగ్రహాన్ని అదే గ్రామానికి చెందిన కొంతమంది నాస్తికులు ధ్వంసం చేశారని, ఆ వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన యువత పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# బీపీఏలో సింగరేణి డైరెక్టర్ల పర్యటన

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో గురువారం సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంవోఈఎఫ్ (ఐఆర్‌వో హైదరాబాద్ కార్యాలయం) డైరెక్టర్ తరుణ్ పర్యటించారు. కై రిగూడ ఓసీపీలోని క్వారీ లోపలికి వెళ్లి బొగ్గు ఉత్పత్తి పనులను పరిశీలించారు. అనంతరం ఉత్పత్తి, ఉత్పాదకతలతో పాటు పలు అంశాలపై ఏరియా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. ఎంవోఈఎఫ్ డైరెక్టర్ తరుణ్ కైరిగూడ ఓసీపీ వద్ద పర్యావరణాన్ని పరిశీలించి పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా జీఎం రవిప్రసాద్, కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎం జీవీఎల్ గణపతి, కార్పొరేట్ అడిషనల్ మేనేజర్లు రవికిరణ్, శ్రీనివాస్, కైరిగూడ పీవో సత్యనారాయణ, మేనేజర్ ప్రవీణ్ పాటింగ్, ఎన్విరాన్‌మెంట్ అధికారులు హరీష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

### చోరీకి గురైన బైక్‌లు స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల చోరీకి గురైన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్సై రమణారెడ్డి తెలిపారు. జైనథ్ మండలంలోని జామ్నికి చెందిన ఖండేష్కర్ గౌతమ్ ఈ నెల 18న రిమ్స్ ఎమర్జెన్సీ వార్డు ముందు బైక్‌ను పార్క్ చేసి ఆస్పత్రి లోనికి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసే సరికి బైక్ మాయమైంది. శ్రీరాం కాలనీకి చెందిన పీసర రమేశ్ బాలాజీ ఆస్పత్రి ఎదుట బైక్ పార్క్ చేశాడు. గంట తర్వాత తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించకుండా పోయింది. ఇద్దరూ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు.